జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 5-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 558 పేజీలు: 4 వెల : రూ.7

# ఘోర రోడ్డు ప్రమాదం







* కొర్లాం హైవేపై కారును ఢీకొన్న లారీ
* ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
* మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
* మృతులు ఒడిశా బాలాసోర్ చెందిన వారిగా గుర్తింపు * పరారీలో డ్రైవర్

**సోంపేట, జనవరి 4(వార్త):** సోంపేట మండలం కొర్లం హైవేపై ఆదివారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఓ మహిళ తోపాటు ఆమె ఇద్దరు పిల్లలు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులు ఒడిస్సా రాష్ట్రం బాలాసోర్‌కు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొర్లం హైవే త్రీ రోడ్డు జంక్షన్లో బారువా రోడ్ నుంచి ఓ వ్యక్తి స్కూటీపై వచ్చి హైవే మొదటి లైన్ దాటి రాంగ్ రూట్లో నేరుగా రెండవ లైన్‌లోకి వెళ్లిపోయాడు. పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు అతివేగంగా వెళుతున్న ఓ లారీ స్కూటీని తప్పించబోయి అదుపుతప్పి డివైడర్ దాటి రెండవ లైన్ మీదుగా పొలాల్లోకి దూసుకుపోయింది. ఇంతలో రెండవ లైన్‌లో ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్తున్న ఒడిస్సాకు చెందిన కారును లారీ బలంగా ఢీకొట్టడంతో కారు పల్టీలు కొట్టి నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న బాలాసోర్ జిల్లా మయూర్ బంజ్ సమీపంలో ఉదులాకు చెందిన సుమారు 30 ఏళ్ల వయసుగల కనక లత అక్కడికక్కడే మృతిచెందగా, సుమారు 8ఏళ్ల వయస్సున్న అభిలాష, ఏడాది వయసు గల ఆదిత్యలు తీవ్రంగా గాయపడ్డారు. వారు బారువ ప్రభుత్వ ఆసుపత్రిలో కన్నుమూశారు. కారు డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి తీవ్ర గాయాలు పాలయ్యారు. వీరిలో డ్రైవర్ పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరిద్దరిని మెరుగైన వైద్యం కోసం టెక్కలి ఏరియా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కారును ఢీకొన్న లారీ డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాదం జరిగిన నలభై నిమిషాల వరకు క్షతగాత్రులను తరలించేందుకు అంబులెన్స్ రాకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు హైవే అంబులెన్స్‌లో క్షతగాత్రులను బారువా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలానికి బారువా ఎస్సై హరిబాబు నాయుడు సిబ్బంది చేరుకొని పర్యవేక్షించారు. మృతి చెందిన మహిళ విశాఖలో ఉద్యోగం చేస్తున్నట్టు తెలిసింది. బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భోగాపురంలో తొలి విమానం.. ల్యాండింగ్




* ఢిల్లీ నుండి భోగాపురం చేరుకున్న ఎయిర్ ఇండియా విమానం * అదే విమానంలో భోగాపురం చేరుకున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ * ఇది చారిత్రాత్మక రోజు * రైతుల త్యాగం వల్లే భోగాపురం ఎయిర్‌పోర్టు * విజన్ ఉన్న నేత చంద్రబాబు * త్వరలో ప్రధానిచే ప్రారంభం * కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం/భోగాపురం, జనవరి 4(వార్త):** ఉత్తరాంధ్ర చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచే రోజుగా 2026 జనవరి 4 ఖ్యాతినార్జించింది. ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి వ్యాలిడేషన్ కమర్షియల్ ఫ్లైట్ ఎయిర్ ఇండియా.. ఉత్తరాంధ్ర వాసుల ఆశలను మోసుకుంటూ ఘనంగా ల్యాండ్ అయింది. ఈ ప్రత్యేక వేడుక చూడటానికి ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజా ప్రతినిధులు అందరూ భోగాపురం బాట పట్టారు. జనవరి మూడవ తేది శనివారం నాడు శ్రీకాకుళం జిల్లాలో సుడిగాలి పర్యటన చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. ఈ వ్యాలిడేషన్ ఫ్లైట్ పర్యటన కోసం శనివారం రాత్రే ఢిల్లీ చేరుకున్నారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచే రోజు కోసం ఢిల్లీ నుండి ఎయిర్ ఇండియా కమర్షియల్ ఫ్లైట్ ఆదివారం ఉదయం 8:45 గంటలకు బయలుదేరింది. సరిగ్గా 11:01 నిమిషాలకు భోగాపురం విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. అదే విమానంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, విమానశాఖ అధికారులు ఆ ఫ్లైట్‌లో ప్రయాణించారు. రామ్మోహన్ వ్యాలిడేషన్ ఫ్లైట్ నుండి దిగగానే ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజా ప్రతినిధులు ఆత్మీయ స్వాగతం పలికారు. తొలి వ్యాలిడేషన్ ఫ్లైట్‌తో ఫోటోలు దిగారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదిక వద్ద నుండి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ మాట్లాడారు. విమానాశ్రయ నిర్మాణంలో కీలకమైన తొలి వ్యాలిడేషన్ ల్యాండింగ్ సక్రమంగా జరిగిందని తెలిపారు. భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు బీజం వేసింది విజనరీ లీడర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని కితాబిచ్చారు. కనెక్టివిటి ద్వారా అభివృద్ధి అని నమ్మే చంద్రబాబు నాయుడు.. 2016లో పూసపాటి అశోక్ గజపతి రాజు కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలోనే ప్రిన్సిపల్ అప్రూవల్ చేసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఆ తరువాత ప్రభుత్వం మారడం, ఇతర కారణాలు, ఇబ్బందులు వల్ల ప్రాజెక్ట్ ఆలస్యమైందన్నారు. మళ్లీ తాను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత దేవుడు నాకిచ్చిన అవకాశంగా భావించి.. పద్దెనిమిది నెలల్లో, ప్రతీ నెలలో ప్రత్యేక సమీక్షలు చేస్తూ తుది దశకు తీసుకువచ్చానని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ తుది దశకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష సందర్భంలో మొదటగా డిసెంబర్ 2026 గా సూచిస్తే.. అందుకు ఆయన ఒప్పుకోలేదని గుర్తు చేశారు. ఆరు నెలల ముందే ఇది పూర్తి చెయ్యాలని ఆయన డేడ్ లైన్ విధించారని అన్నారు. ఆయన మాటను మార్గదర్శకంగా తీసుకుని అంతకన్నా ముందే ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఈ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో కీలకంగా ఉన్న జి.ఎం.ఆర్ సంస్థను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జీఎమ్మార్ సొంత ప్రాంతం కావడంతో మరింత ప్రత్యేక చొరవతో నిర్మాణం జరిగినట్టు గుర్తు చేశారు. దానికి తోడు ఎల్ అండ్ టి సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డిజిసిఏ.. ఇలా అన్ని వ్యవస్థలు సరైన సమన్వయం చేసుకుని త్వరితగతిన నిర్మాణం జరిగేలా చొరవ చూపారని గుర్తు చేశారు.

## స్థానిక రైతాంగానికి ధన్యవాదాలు..

ఈ వేదికపై భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పురోగతిని వివరిస్తున్న సమయంలోనే స్థానిక రైతుల త్యాగాన్ని కూడా




రామ్మోహన్ నాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు. భూమి త్యాగం చేసిన రైతాంగం అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నా అని రామ్మోహన్ నాయుడు అన్నారు. వారి త్యాగం వల్లే బ్రహ్మాండమైన ప్రాజెక్ట్ రూపొందిందని, వారి త్యాగం వృధా చెయ్యకుండా వరల్డ్ క్లాస్ సిటిగా తయారుచేస్తా అని హామీ ఇచ్చారు.

## విజన్ ఉన్న నేత చంద్రబాబు..

అభివృద్ధి విషయంలో ఎప్పుడు తన స్పష్టమైన విజన్ ను చూపే చంద్రబాబు ఆలోచనను.. ఓర్వలేని వారు ఎప్పుడు విమర్శిస్తూనే ఉన్నారని రామ్మోహన్ నాయుడు అన్నారు. హైదరాబాద్‌లో శంషాబాద్ విమాశ్రయం విషయంలో అనేక విమర్శలు చేశారని, వారందరూ ఇప్పుడు ఎక్కడైనా గజం భూమి దొరుకుతుందా అని ఎదురు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. అదే పరిస్థితి ఇప్పుడు భోగాపురంలో కూడా ఎదురుకానుందని, మన ప్రాంత వాసులు ఇప్పుడు అదే ఫలాలను పొందనున్నారని స్పష్టం చేశారు. విజన్ ఉన్న నేత చంద్రబాబు అని అభివర్ణించారు.

## కనెక్టివిటితోనే అభివృద్ధి..

ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలి అంటే అందుకు కనెక్టివిటి ప్రధాన భూమిక పోషిస్తుందని, భోగాపురంతో అంతర్జాతీయ బంధాలు ఈ ప్రాంతంతో బలపడతాయని రామ్మోహన్ అన్నారు. ఉపాధి, వ్యవసాయం, రవాణా, పర్యాటకం.. ఇలా అన్ని రంగాలు వృద్ధి చెందుతాయని స్పష్టం చేశారు.

## ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం

ప్రాజెక్ట్ పూర్తి అవ్వడానికి సరైన దిశా నిర్దేశంతో సహకారం అందించిన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగానే మరొక నాలుగైదు నెలల్లో ఈ విమానాశ్రయం ప్రారంభోత్సవం చేస్తామని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. టెస్ట్ ఫ్లైట్ ల్యాండింగ్ అంటే కీలక పనులు పూర్తయ్యాయి అని తెలపడానికి సంకేతం అని అన్న రామ్మోహన్ నాయుడు.. సవాలక్ష చెక్ లిస్టులను ఇప్పటికే పూర్తి చేసుకున్నామని అన్నారు. భోగాపురం విమానాశ్రయం ఒక్క విజయనగరం జిల్లాకే పరిమితం కాలేదని, తాను ఉత్తరాంధ్ర, ఒరిస్సా, రాయ్ పూర్ ఇలా ఎక్కడ పరిధిలో పర్యటిస్తున్నా అక్కడి ప్రజలు ఈ బృహత్తర ప్రాజెక్ట్ పట్ల తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూనే ఉన్నారని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్ట్ లు ప్రారంభం అవుతాయి కాని.. ఎప్పుడు పూర్తి అవుతాయో తెలియదు అనేది చాలామందిలో ఉన్న భావన అని.. వాటికి ముగింపు పలుకుతూ సమగ్రంగా అభివృద్ధి చెందిన ప్రాజెక్ట్ భోగాపురం విమానాశ్రయంను త్వరలోనే ప్రారంభించడం.. అని రామ్మోహన్ అభివర్ణించారు. ఈ పోర్టుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయని, ఎకనామిక్ రీజియన్ గా అభివృద్ధి చెందనుందని అన్నారు. విమానయానంలో కీలకంగా ఉండే ఎం.ఆర్.వో (మెంటేనేన్స్, రిపేర్, ఆపరేషన్స్) కోసం భోగాపురంలోనే అయిదు వందల ఎకరాలు కేటాయించడం జరిగిందని, మాన్సాస్ ట్రస్ట్ ద్వారా ఎడ్యు సిటి అందుబాటులో ఉండనుందని తెలిపారు. వేల కోట్ల ఆస్తిని యువత కోసం ఇచ్చిన పూసపాటి అశోక్ గజపతి రాజు, అదితి గజపతిరాజు లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తిరిగి అదే విమానంలో డిల్లీ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఎంపిలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, జి.ఎం.ఆర్ అధికారులు, కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## కార్యకర్తలే రాజకీయ పార్టీలకు వెన్నుదన్ను

* మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు



## రెంటికోట పీహెచ్‌సీ విధులకు సునిల్

*ఆయన రాడు.. సేవలందించడు -ఆస్పత్రికి డుమ్మా కొడుతున్న వైద్యుడు *సిబ్బంది హాజరు నామమాత్రమే * వైద్య పరీక్షలకు అంతరాయం *రోగులకు తప్పని ఎదురుచూపులు *ప్రైవేట్ క్లినిక్ మాత్రం నిరంతరం హాజరు *ఆయన తీరుపై మండిపడుతున్న ప్రజలు


## భారీ యంత్రాలతో గిరిజన రహదారులు ధ్వంసం

* పట్టించుకోని ఐటీడీఏ అధికారులు
* అభివృద్ధి పేరుతో విధ్వంసమంటూ గిరిజనుల ఆరోపణ
* వాహనాలను అడ్డుకున్న గిరిజన యువకులు
* పాలకులు, అధికారులు స్పందించాలని డిమాండ్

లోపల పేజీల్లో

## బీఎస్సీ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ కోర్సుల దరఖాస్తుకు ఆరో తేదీ వరకు గడువు పెంపు

**శ్రీకాకుళం, జనవరి 4 (వార్త):** ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బీఎస్సీ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ కోర్సుల 2025 విద్యా సంవత్సర అడ్మిషన్లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసిందని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. బీఎస్సీ అనస్తీషియా, కార్డియాక్ కేర్, న్యూరో ఫిజియాలజీ, పెర్‌ఫ్యూజన్, ఎమర్జన్సీ మెడిసిన్, రెనాల్ డయాలసిస్, ఆప్తోమెట్రీ, రెసిపెటరీ థెరపీ, ఇమేజింగ్(రేడియాలజీ), బ్లడ్ ట్రాన్‌ఫ్యూజన్, రేడియోథెరపీ, ఫిజీషియన్ అసిస్టెంట్, మెడికల్ రికార్డ్స్ టెక్నాలజీ, ల్యాబ్ టెక్నీషియన్, బీపీటీ కోర్సుల్లో కన్వీనర్ కోటాలో సీటు పొందుటకు 2025, అంతకు ముందు ఇంటర్ బైపీసీ పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల ఆరో తేదీ వరకు గడువు ఉందన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులకు ఇది సువర్ణవకాశమన్నారు. ఈ సీట్లు పొందిన వారికి ఫీజు రీయంబర్స్‌మెంట్ పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు రాగోలులోని జెమ్స్ క్యాంపస్‌లో గల తమ కళాశాలను లేదా 9121999654, 7680945357 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.


డా. యన్.టి.ఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం, విజయవాడ
Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P.: VIJAYAWADA – 520 008.
NOTIFICATION

In continuation of the earlier Notification dated 16.10.2025, in consideration of the huge requests of the Students and Parents, Applications are Re-Invited from the eligible candidates who fulfilled the eligibility criteria for admission into **Allied and Healthcare** Courses Under Competent Authority Quota Seats available in the colleges affiliated to Dr. NTR UHS, Vijayawada and Private Universities also for the Academic year 2025-26 in the state of Andhra Pradesh.

SCHEDULE

| | | |
|---|---|---|
| 1. | Date of issue of Notification to apply for admission into BPT and B.Sc. Allied and Healthcare courses colleges for the academic year 2025-26 | 03.01.2026 |
| 2. | Availability of online Applications https://apuhs-ugadmissions.aptonline.in/ugbpt/HOME/Home | 06.00 PM on 03.01.2026 to 11.00 AM on 06.01.2026 |
| For Detailed Notification, Prospectus/Regulations – https://drntr.uhsap.in | | |
| All the above dates are tentative and the University reserves the right to change them without assigning any reason or advance notice. | | |

# రెంటికోట పీహెచ్‌సీ విధులకు సునిల్

- -ఆయన రాడు..సేవలందించడు
- -ఆస్పత్రికి డుమ్మా కొడుతున్న వైద్యుడు
- -సిబ్బంది హాజరు కూడా నామమాత్రమే
- -వైద్య పరీక్షలకు అంతరాయం
- -రోగులకు తప్పని ఎదురుచూపులు
- -ప్రైవేట్ క్లినిక్ మాత్రం నిరంతరం హాజరు
- -ఆయన తీరుపై మండిపడుతున్న ప్రజలు

**పలాస, జనవరి 4(వార్త):** రెంటికోట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో రోగులకు ఎదురు చూపులు తప్పడం లేదు. విధులకు డుమ్మా కొడుతున్న డాక్టర్ సునీల్ పనితీరుపై రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్యుడు ఆసుపత్రికి రాకుండా ప్రైవేట్ క్లినిక్‌లో సేవలందిస్తుండడంపై స్థానిక ప్రజలు, రోగులు మండిపడుతున్నారు. డాక్టర్ ముఖం ఎప్పుడూ చూడలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎప్పుడు వస్తారో కూడా తెలియదని స్థానికులు వాపోతున్నారు. రెంటికోటలో వైద్య సిబ్బందిపై పనితీరుపై కూడా స్థానికులు మండిపడుతున్నారు. వైద్య సిబ్బంది విధుల నిర్వహణపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభు త్వం దగ్గర జీతాలు తీసుకొని సొంత క్లినిక్‌లో సేవలందించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.




## బూరగాం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం

### -రూ.65 లక్షల నాబార్డు నిధులతో పనుల ప్రారంభం



**సోంపేట, జనవరి 4 (వార్త):** సోంపేట -కంచిలి రోడ్డుకు మోక్షం లభించింది. అడుగడుగునా గోతులతో అధ్వానంగా తయారైన ఈ రోడ్డు పనులు ఎట్టకేలకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. కంచిలి మండలం బూరగాం మీదుగా సోంపేటకు అనేక గ్రామాల ప్రజలు ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రాధాన్యం గల ఈ రహదారిని ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడంతో విపరీతమైన గోతులతో అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ఈ రహదారిపై దృష్టి సారించి సంబంధిత అధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడంతో నాబార్డ్ నుంచి రూ.65 లక్షల నిధులు మంజూరై అన్ని రకాలైన అనుమతులు లభించడంతో పనులు చేపట్టేందుకు ఆదివారం నుంచి ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుకిరువైపులా చదును చేస్తున్నారు. 3.75 మీటర్ల వెడల్పైన తారు రోడ్డు నిర్మాణం సోంపేటలోని బాలుర హైస్కూల్ నుంచి బూరగాం వద్ద రైల్వేగేట్ వరకు చేపట్టనున్నట్టు ఏఈ ధనుంజయ్ రావు తెలిపారు.

## మోడల్ మున్సిపాలిటీగా పలాసను తీర్చిదిద్దుతా




**పలాస, జనవరి 4(వార్త):** మోడల్ మున్సిపాలిటీగా పలాసను తీర్చిదిద్దుతానని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మూడో వార్డు పద్మనాభపురంలో రూ.7 లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్‌తో సీసీ డ్రైన్లు, రోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ మున్సిపాలిటీల్లో స్వచ్ఛత, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సేవల్లో నాణ్యత చాటుకోవాలన్నారు. పలాసు వంటి ప్రాంతాల్లో ఇలాంటి ప్రణాళికలు ప్రభుత్వ మాస్టర్ ప్లాన్‌లకు ఆధారంగా ఉంటాయని చెప్పారు. స్థానికుల సహకారంతో ఈ లక్ష్యులు సాధ్యమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సవర సోమేశు, మాజీ కౌన్సిలర్ బతకల బాలమ్మ, డి.నాగభూషణం, యువ నాయకులు కె.నరసింహులు, డొక్కరి దిలీప్‌కుమార్, ఆ గ్రామ యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య పరీక్షలు




**పలాస, జనవరి 4(వార్త):** జై జగన్నాథ్ ఒడియా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కాశీబుగ్గ ఒడియా బ్రాహ్మణ సంఘ భవనంలో డాక్టర్ విశ్వనాథం చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యముతో వందమంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేపట్టారు. బిపి, షుగర్ ఇతర రోగాలపై పరీక్షలు నిర్వహించారు. జై జగన్నాథ్ బ్రాహ్మణ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ త్యాడి, బాబురావు పండా మాట్లాడుతూ బీపీ, షుగర్ లేకుండా ఉండటం నిజంగా ఆరోగ్యంలో మహాభాగ్యమని, ఇది సమాజ సేవలో మిమ్మల్ని ఎప్పుడూ చురుకుగా ఉంచుతుందన్నారు. ఈ రెండు సమస్యలు జీవనశైలిని మార్చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కైలాస దాస్, పూజారి రవి నారాయణ పండా, దేవేంద్ర త్యాడి, సంతోష్ త్యాడి, రాము పండా పాల్గొన్నారు.


## పీజీటీ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ



**పోలాకి, జనవరి 4(వార్త):** ఈదులవలసలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో పీజీటీ (ఫిజిక్స్) పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ పైడి ప్రవీణ తెలి పారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుకు ఎంఎస్సీ, బీఈడీ అర్హతలు కలిగిన అభ్య ర్థులు నేరుగా పాఠశాలకు హాజరై తమ వివరాలను అందజేయాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.12,000 వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం

**పలాస, జనవరి 4(వార్త):** అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు స్పష్టం చేశారు. ఆదివారం తిలక్‌నగర్‌లో రూ.5 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీని మోడల్‌గా తీర్చిదిద్దే సంకల్పానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. అధికారులు ఎటువంటి లోపాలున్నా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. వేగంగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ మూల కృష్ణారావును ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సవర సోమేసు, పెద్దలు దబ్బీరు నాగభూషణం, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## పోక్సో, జీఎస్టీ సేవింగ్స్ చట్టాలపై అవగాహన




**పలాస, జనవరి 4(వార్త):** పోక్సో చట్టం, జీఎస్టీ సేవింగ్స్ చట్టాలపై ప్రముఖ న్యాయవాది, మాజీ ప్రభుత్వ అసిస్టెంట్ న్యాయవాది కె.దేవరాజ్ ..వాలంటీర్లకు ఆదివారం అవగాహన కల్పించారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో ఈ కార్యక్రమం సున్నాడలోని మండల ప్రజా మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ న్యాయవాది, మాజీ అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాది కె.దేవరాజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. 12 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు బాలికలు, బాలురపై మాటల ద్వారా గానీ, లైంగిక చేష్టల ద్వారా గానీ, వేధింపులకు పాల్పడినట్లయితే చట్ట ప్రకారం ఎటువంటి కఠిన శిక్షలు అమలవుతాయో ఆయన వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు మానసిక పరిపక్వతను, మంచి సంస్కారాలను పెంపొందించుకుని బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు.

మరో ముఖ్య అతిథి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగాధ్యక్షులు పి.వెంకటరమణ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అంశంపై అవగాహన కల్పించారు. జీఎస్టీ ద్వారా ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు ప్రాముఖ్యతను వివరించారు.

కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.పి.మధు, అధ్యాపకులు కోదండరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలు తగ్గించిన ఘనత కూటమిదే

### -ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు



**పలాస, జనవరి 4(వార్త):** దేశంలోనే మొదటిసారి విద్యుత్ చార్జీలు తగ్గించిన ఘనత ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి దక్కిందని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. ఆదివారం ఆయన పలాసలో విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 2014-2019 మధ్య మిగులు విద్యుత్ ఉంటే,2019లో ప్రజలకు నయవంచక మాటలు చెప్పి గద్దెనెక్కిన జగన్ రెడ్డి, విద్యుత్ రంగాన్ని పూర్తిగా అనిశ్చితి, ఆర్థిక భారంలోకి నెట్టేశారని ధ్వజమెత్తారు. ఒక్క అవకాశం ఇవ్వండి.. ఈ రాష్ట్రాన్ని స్వర్ణయుగం చేస్తానని చెప్పి, అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత జగన్ రెడ్డిదే అన్నారు. 2019లో ప్రమాణ స్వీకారం రోజున విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి, ఐదేళ్లలో 9 సార్లు దాదాపు 32 వేల కోట్లు ప్రజలపై భారం మోపిన మోసగాడు జగన్ రెడ్డి మాత్రమేని తెలిపారు. గత ఐదేళ్లు అనాలోచిత నిర్ణయాలతో విద్యుత్ రంగాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టేశారని మండిపడ్డారు. అప్రకటిత విద్యుత్ కోతలతో ఇటు సామాన్య ప్రజలకు, రైతులకు, పరిశ్రమలు, వ్యవసాయం కూడా గడ్డు పరిస్థితి కల్పించారని వివరించారు. ఇంతటి సంక్షోభంలో ఉన్న విద్యుత్ రంగాన్ని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత..ఇచ్చిన మాట ప్రకారం చార్జీలు పెంచకుండా ఏపీఈఆర్సీ సిఫార్సు చేసిన ఆ భారం సుమారు 4498 కోట్లు ప్రభుత్వమే భరించి ప్రజలకు ఉపశమనం కల్పించిందన్నారు. ఆక్వా రైతులకు యూనిట్ రూ.3.50లకు ఇచ్చి వాళ్ళ నడ్డి జగన్ రెడ్డి విరిస్తే, నేడు వాళ్లకి 2 రూపాయలకు కూటమి ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తూ ఇది మంచి ప్రభుత్వమని నిరూపించుకుందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేస్తూ ప్రత్యామ్నాయ మార్గాలుగా సోలార్, పవన విద్యుత్ వైపు ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఎస్సీ ఎస్టీలకు ఉచిత సోలార్ రూఫ్‌టాప్‌లు అందిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి ప్రజామోదం ఎప్పటికీ ఉంటుందని, ప్రజలు కూటమి ప్రభుత్వానికి బాసటగా నిలుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

### -పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

### -జీడి, కొబ్బరి బోర్డులను ఏర్పాటు చేయాలి

### -చైతన్య రైతాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మామిడి మాధవరావు

**మందస, జనవరి 4(వార్త):** ఎంతో కష్టపడి రైతులు పండించిన ధాన్యం సేకరణలో రైస్ మిల్లర్లు చేస్తున్న దోపిడీ, అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలని చైతన్య రైతాంగ సంక్షమ సంఘం అధ్యక్షుడు మామిడి మాధవరావు అధికారులను కోరారు. హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో ఆదివారం రైతు సంఘ ప్రతినిధుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ జీడి కొబ్బరి బోర్డులను నెలకొల్పాలని, బస్తాకి 10 కేజీల ధాన్యం అధిక తూకంలో రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలన్నారు. వంశ ధార కాలువ ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని, పచ్చని ఉద్యానవనం ఉద్దా నంలో జీడి, కొబ్బరి బోర్డులను నెలకొల్పాలని కోరారు. మిల్లర్లు 80కేజీల బస్తా ధాన్యంకు తేమ పేరుతో 10కేజీలు అధిక తూకం వేసి అన్నదాతలను మిల్లర్స్ దోపిడీకి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ట్రాక్టర్ లేబర్ చార్జీలు కలిసి చార్జీల పేరుతో బస్తాకి వెయ్యి రూపాయల వరకు రైతాంగాన్ని మిల్లర్స్ మోసం చేస్తున్నారని ఆరోపించారు. సచివాలయాల ద్వారా మిల్లులకు రైతులు పండించిన ధాన్యాన్ని, కల్లాల నుంచి మిల్లుకు తరలించే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వంశధార కాలువను బొడ్డపాడు, వేపాడు చెరువులతో అనుసంధానం చేసి ఇచాపురం వరకు పొడిగించాలని కోరారు. కార్గో ఎయిర్‌పోర్ట్ కోసం బలవంత భూసేకరణ, వ్యతిరేకిస్తూ కార్గో ఎయిర్‌పోర్ట్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, కిడ్నీ వ్యాధిగ్రస్తులు మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు పలాస నియోజకవర్గంలోని పరిశ్రమలను నెలకొల్పే వలసలకు నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతాంగ ప్రతినిధుల తీర్మానాలను ప్రభుత్వం ప్రజాప్రతినిధులు అందజేస్తామని, ప్రభుత్వం తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ ప్రతినిధులు దాసరి శ్రీరాములు, ముదుమంచి ముకుందరావు, గొర్లె చలపతిరావు వి.మాధవరావు, కొమర వాసు, నల్ల హడ్డి, మార్పు మన్మథరావు, తామాడ త్రిలోచనారావు, ఎం.ధర్మారావు, కామేశ్వరరావు, ఎం.మన్మథరావు, కీలు తవిటయ్య, డొక్కరి వీరస్వామి, ఎం.గణపతి, కూర్మారావు, బొడ్డు సింహాద్రి, గుంట లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



## తెలుగుదేశం గూటికి నెలవంక సర్పంచ్



**ఇచ్ఛాపురం, జనవరి 4(వార్త):** తెలుగుదేశం పార్టీ గూటికి కవిటి మండలం నెలవంక పంచాయతీ సర్పంచ్ దుర్గాసి గౌతమీ రెడ్డి చేరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌బాబు నెలవంక పంచాయతీలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం పనిచేయడానికి నెలవంక పంచాయతీ వైస్సార్సీపీ సర్పంచ్ ప్రతినిధి దుర్గాసి కుమార్ మోహన్ రెడ్డితో పాటు సుమారు 50 కుటుంబాలు వైసీపీ పార్టీ నుంచి ఎమ్మెల్యే సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులతో పాటు జిల్లా పార్లమెంటరీ తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ ఆశి.లీలారాణి పాల్గొన్నారు.

## అనాథలకు అండగా ట్రూహ్యాండ్స్ ఫౌండేషన్




**సోంపేట, జనవరి 4(వార్త):** కవిటి మండలం గొనప పుట్టుగలో అనారోగ్యంతో తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథలకు కంచిలికి చెందిన ట్రూ హాండ్స్ ఫౌండేషన్ అండగా నిలిచింది. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ నర్తు కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించి మృతి చెందిన బడగల శివాజీ కళావతి దంపతులకు నివాళులర్పించారు. అనంతరం తల్లిదండ్రుల ప్రేమకు దూరమై ఏడేళ్ల వయసు గల అనన్య పదహారేళ్ళ వయసు గల చరణ్ లను చూసి ట్రూ హాండ్స్ సభ్యులు చలించిపోయారు. ఈ సందర్భంగా వారికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. పదో తరగతి వరకు పుస్తకాలు స్టేషనరీ సామగ్రి అందజేస్తామన్నారు. సంస్థ నూతన క్యాలెండరును చిన్నారుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జుత్తు శ్రీనివాస్, గుమ్మడి అశోక్, పురుషోత్తం, సింహాచలం, గడ్డం కృష్ణ, స్థానిక సర్పంచ్ బద్రి ప్రకాష్, కేశవ, రామారావు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా ఆనంద్ జన్మదిన వేడుకలు



**సోంపేట, జనవరి 4(వార్త):** సోంపేటలో సీనియర్ టీడీపీ నేత, శ్రీ కోదండరామ ఆలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్, శ్రీ నింభాషినమ్మ ఆలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ బీన ఆనంద్ జన్మదిన వేడుకలను అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బడుగు వర్గాలకు నిరంతరం అండగా ఉండే ఆనంద్ ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో నిర్వహించుకోవాలని అభిమానులు కోరారు. ఈ సందర్భంగా సోంపేటలో అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆనంద సత్కరించి బర్త్డే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పొందూరు రాజు, దున్న జోగారావు, బీన ఈశ్వరరావు, దుద్ది చిరంజీవులు, కాంచన రాఘవదాసు, గేదెల సత్యం, దున్న ప్రకాష్, గేదెల మధు, మల్లా షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

## మొదలవలసను అభినందించిన మాదారపు

**శ్రీకాకుళం, జనవరి 4(వార్త):** శ్రీకాకుళం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా మొదవలస రమేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు నగర పార్టీ మాజీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను నియమించిన జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, చంద్రబాబునాయుడు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కరవంజ మోడల్ స్కూల్‌లో గెస్ట్ టీచర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**జలుమూరు, జనవరి 4 (వార్త):** కరవంజలోని ఏపీ మోడల్ స్కూల్‌లో గెస్ట్ టీచర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. పాఠశాల కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీ ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. పీజీటీ సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు కనీసం 50 శాతం మార్కులు, బీఈడీ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాలతో తమ దరఖాస్తులను జనవరి 5వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా సమర్పించాలన్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సెలక్షన్ కమిటీ ద్వారా డెమో నిర్వహించి, తుది జాబితాను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,000 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440322964, 8688296372 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.




# ఉద్యమ స్ఫూర్తి.. చిలకమ్మ కీర్తి..!

- 'మంత్రిబుడి' పేరుతో ఉద్యమాల్లో పాత్ర
- 'జనశక్తి'లో పోరాటాలకు దిక్సూచి
- గిరిజన మహిళగా పోరాటం

**మందస, జనవరి 4(వార్త):** గిరిజనుల హక్కులకై ఉద్యమ బాటను ఎంచుకుంది ఆమె. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో కూడా పీడిత జనంకై ఆ గొంతు గళం విప్పింది. నిరక్షరాలైనప్పటికీ.. అక్షరాస్యులను సైతం అబ్బురపరిచింది. ఆదివాసీ కుటుంబంలో పుట్టిన ఆమె మరో వీరగున్నమ్మలా.. అపర కాళికలా పోరాడి.. చరిత్రలో స్థానాన్ని పదిలపరుచుకుంది. ఆ పోరాటయోధురాలే సవర చిలకమ్మ అలియాస్ మంత్రిబుడి. శ్రీకాకుళ సాయుధ పోరాట చరిత్రలో మందసకు ఎంతో చరిత్ర ఉంది. విప్లవోద్యమంలో అరుణతారగా మంత్రిబుడి సుస్థిరస్థానం పొందింది. మందస మండలంలోని గిరిజన ప్రాంతమైన కొండలోగాం పంచాయతీ టబాగాం అనే చిన్న కుగ్రామంలో చిలకమ్మ జన్మించింది. శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగపోరాటం ప్రారంభానికి ముందు పార్టీలో లీగల్‌గా ఆమె పని చేసింది. విప్లవకారులకు సేవలు అందించింది. ఆదివాసీల హక్కులకై విప్లవాలు పుడుతున్నాయని గిరిజనులను చైతన్యపరిచింది. విప్లవకారులను ఆదివాసీలు ఆదరించాలని చెప్పేది. 1968 నవంబరు 26న సాయుధ పోరాటం ప్రారంభం కాగా, ఏజెన్సీ.. ఉద్దానానికి కేంద్ర బిందువుగా ఉన్న కొండలోగాం కేంద్రంగా సాయుధ ఉద్యమం పని చేసింది. తోటి గిరిజనులను చైతన్యపరిచి.. పోరాటాలకు సహకరించేది. పార్టీ సమావేశాలను గిరిజన భాషలోకి అనువదించి చెప్పేది. విప్లవకారులకు కొరియర్గా పని చేస్తూనే.. సభ్యురాలిగా కూడా తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చింది. బ్రిటిష్ పాలకులను ఎదురొడ్డి అమరురాలైన వీరగున్నమ్మ చరిత్ర బాహ్య ప్రపంచానికి తెలియగా, సవర చిలకమ్మ చరిత్ర మాత్రంగా మరుగున పడిపోయింది. భుక్తికోసం.. హక్కు కోసం.. ఆదివాసీ విముక్తి కోసం.. పోరాడిన సవర చిలకమ్మ 1995 జనవరి 5న మరణించింది. చిలకమ్మ పలుమార్లు పోలీసుల చిత్ర హింసలకు గురై అవమానాలు ఎన్నో ఉన్నా.. కడకు జైలు జీవితం అనుభవించారు. తన కేసులను తానే 'వకాలత్తు' పుచ్చుకొని గెలుపు పొందిన సందర్భాలు ఉన్నాయి. జైలు నుండి బయటకు వచ్చిన తరువాత ఎలాంటి అరుదు బెరుదు లేకుండా వృద్ధాప్యాన్ని సైతం లెక్క చేయకుండా తన జీవన శైలిని సాగించారు. ప్రతిఘటనా పోరాటం నిర్మించాలన్న శ్రీకాకుళం జిల్లా తొలి ఆదివాసీ విప్లవకారులు కామ్రేడ్లు కోరన్న, మంగన్నల వారసత్వపు బాధ్యతలను స్వీకరించి తుదిశ్వాస వరకు పోరాటమే లక్ష్యంగా జీవించిన అమరురాలు చిలకమ్మ. సీపీఐ(ఎంఎల్) జనశక్తి రాష్ట్ర పార్టీ నాయకుడు అమరుడు కామ్రేడ్ కుమారన్న(అప్పలస్వామి) చిలకమ్మను కలసి పరామర్శించిన సందర్భంగా.. తన చివరి కోరికను విన్నవించుకోగా, ఆమె పేరున స్మారక చిహ్నం (స్థూపం) నిర్మితమైందని చెబుతారు. పోరాటాలు స్ఫూర్తిగా నిలిచిన మంత్రిబుడి స్మారకార్థం కొండలోగాంలో భారీ స్థూపాన్ని జనశక్తి నేతలు పోతనపల్లి అప్పలస్వామి అలియాస్ కుమారన్న, జయక్క ఆధ్వర్యంలో నిర్మించారు. ప్రతీ ఏటా చిలకమ్మ ఘనంగా జయంతి, వర్థంతి ఆదివాసీ కుటుంబంలో జన్మించి, సాయుధ పోరాటంలో శత్రువులతో పోరాడిన సవర చిలకమ్మ అలియాస్ మంత్రిబుడి జయంతి, వర్ధంతి ప్రతీ ఏటా మండలంలోని కొండలోగాం వద్ద నిర్మించిన స్థూపం వద్ద జరుగుతుంది. ఈ ఏడాది కూడా ఆమె జయంతిని నిర్వహిస్తున్నారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 5న మంత్రిబుడి జయంతిని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



## జగన్‌ను పరామర్శించిన ధర్మాన సోదరులు



**పోలాకి, జనవరి 4(వార్త):** డీసీసీబీ మాజీ అధ్యక్షుడు డోల జగన్‌ను మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ఆదివారం పరామర్శించారు. ఆయన తల్లి విశాలాక్షి మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. డోల సీతారాములనాయుడు ప్రజాసేవకు ఆమె చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. వీరి వెంట యువ నాయకులు, నరసన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణ చైతన్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు సహా పలువురు పార్టీ నేతలు ఉన్నారు.

## మండల స్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహణ



**జలుమూరు, జనవరి 4(వార్త):** కరవంజ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మండల స్థాయి ప్రతిభా పరీక్షను ఘనంగా నిర్వహించారు. ప్రజా గ్రంథాలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ పరీక్షలో పాల్గొనే అవకాశం కల్పించారు. ఈ ప్రతిభా పరీక్షలో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బమ్మిడి మాధవరావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, యువత పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, చదువుపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా ఈ పరీక్ష నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## అక్రమ పశు రవాణాపై పోలీసుల దాడి

### జమ్ము గ్రామం వద్ద 9 గేదెల స్వాధీనం



**నరసన్నపేట, జనవరి 4(వార్త):** జమ్ము గ్రామ సమీపంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ మేరకు ఎస్సై శేఖర్‌రావు మాట్లాడుతూ ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో నారాయణవలస సంత నుంచి విజయనగరంకు అక్రమంగా 9 గేదెలను బొలెరో వాహనంలో తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వెంటనే వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అక్రమ రవాణా నిర్ధారణ కావడంతో పశువులతో పాటు బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శేఖర్‌రావు తెలిపారు. అక్రమ పశు రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

## చిన్న బొరిగివలస, జమ్ము గ్రామాల్లో మృతుల కుటుంబాలకు వైసీపీ నేతల పరామర్శ



**నరసన్నపేట, జనవరి 4(వార్త):** చిన్న బొరిగివలసలో ఇటీవల స్వర్గస్తులైన పొన్నాన విజయలక్ష్మి కుటుంబ సభ్యులను జిల్లా వైసీపీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జమ్ము గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన టెంక గన్నయ్య కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు మనోధైర్యం కల్పిస్తూ, ఈ కష్టసమయంలో పార్టీ నాయకత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములుగా నిలవడమే వైసీపీ విధానమని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## వైసీపీ సీనియర్ నాయకుడు జగన్నాథం మృతి



**నరసన్నపేట, జనవరి 4(వార్త):** వైసీపీ సీనియర్ నాయకుడు బోర జగన్నాథం (67) ఆదివారం ఉదయం అనారోగ్యంతో నరసన్నపేటలోని తన స్వగృహంలో మృతి చెందారు. ఆయన గతంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కార్యాలయ ఇన్‌చార్జిగా సేవ లందించారు. ప్రస్తుతం వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణ దాస్ నరసన్నపేట కార్యాలయ పర్యవేక్షకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీలో చురుగ్గా పనిచేస్తూ పలు కార్యక్రమాలలో పాల్గొన్న జగన్నాథం, నాయకులు, కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. ఆయన మృతి పార్టీ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. జగన్నాథం మృతిపై ధర్మాన సోదరులు సహా పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన సేవలను ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకున్నారు.

## జిల్లాస్థాయి సోషల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో బుడితి జడ్పీ హైస్కూల్ విద్యార్థికి తొలి స్థానం

**సారవకోట, జనవరి 4 (వార్త):** జిల్లాస్థాయిలో నిర్వహించిన సోషల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గుణచరణ్ తొలి స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రాము తెలిపారు. గుణచరణ్ ప్రతిభకు గుర్తింపుగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో టెక్కలి ఉప విద్యాశాఖ అధికారి విలియం, అధ్యక్షుడు కేసురావు విద్యార్థికి రూ.5,000 బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా గుణచరణ్ విద్యా ప్రతిభను పలువురు ప్రశంసించారు. మండల విద్యాశాఖ అధికారి మడ్డి వెంకటరమణ, ఉపాధ్యాయులు కె.భూలక్ష్మి, బుడితి సోషల్ సైన్స్ ఉపాధ్యాయులు ఫల్గుణరావు సహా ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విజయంతో బుడితి జెడ్పీ ఉన్నత పాఠశాలకు జిల్లా స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



## హరిపురం వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం





**మందస, జనవరి 4(వార్త):** హరిపురంలోని ఓ వస్త్ర దుకాణంలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. సంక్రాంతికి తెచ్చుకున్న సరుకు అగ్నికి ఆహుతైంది. సంక్రాంతి సమీపిస్తుండడంతో ఆదివారమైనప్పటికీ సోంపేట మండలంలోని మాకన్నపురం గ్రామానికి చెందిన యజమాని మందపాటి జగదీష్ ఉదయం దుకాణం తెరచి, పూజ చేసి, మళ్లీ షాపు మూసివేసి బయటకు వెళ్లిపోయారు. ఇంతలో దుకాణం నుంచి పొగలు రావడంతో స్థానికులు గుర్తించి, యజమాని జగదీష్‌కి ఫోన్ చేసి.. పరిస్థితి వివరించారు. దీంతో ఆయన హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, దుకాణం తాళం తీయడంతో చుట్టుపక్కల వారంతా చేరుకుని, ముందుగా అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి దుస్తులు, వాటి రేకలు బయటకు తీశారు.


అప్పటికే షాపులో దట్టమైన పొగలు వ్యాపించి, మసి పేరుకుపోయి.. నష్టం వాటిల్లింది. షార్ట్ సర్క్యూట్ కానీ, పూజ దీపంతో కానీ ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. సీలింగ్ ఫ్యాన్ కాలిపోయి ఉండడంతో షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. కుటుంబాన్ని పోషించడానికి దుకాణం ప్రారంభించానని, ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయాయని జగదీష్ కన్నీటిపర్యంతమయ్యారు.

## కార్యకర్తలే రాజకీయ పార్టీలకు వెన్నుదన్ను : ధర్మాన

**పోలాకి, జనవరి 4 (వార్త):** ఉరజాంలో ఆదివారం మాజీ ఎంపీటీసీ కణితి తౌడు మూడవ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకైనా కార్యకర్తలే వెన్నుదన్నుగా నిలుస్తారన్నారు. పార్టీని నడిపించే శక్తి, బలం కార్యకర్తలేనని స్పష్టం చేశారు. కార్యకర్తలు పార్టీ కోసం ఎలాంటి కష్టాలైనా భరించి పనిచేస్తారని, అలాంటి వారిని ఎటువంటి పరిస్థితుల్లోనూ నాయకులు విస్మరించకూడదని ఆయన సూచించారు. కార్యకర్తల కృషిని గుర్తించి వారికి తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత నాయకులపై ఉంద న్నారు. అనంతరం తౌడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ధర్మాన కృష్ణ దాస్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక సత్సంగం



**పోలాకి, జనవరి 4 (వార్త):** చింతాడపేటలోని శ్రీరామ యోగి బాబా సేవాశ్రమంలో ఆదివారం ఆధ్యాత్మిక సత్సంగ సభ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బమ్మిడి విశ్వనాథం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ చిక్కోలు చాగంటి, ఇప్పిలి రామకృష్ణ శర్మ ఉత్తరాయణం ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. ఉత్తరాయణం శుభకాలమని, ఈ శుభ ముహూర్తంలోనే భీష్మ పితామహులు తన శరీరాన్ని విడిచి పెట్టారని వారు తెలిపారు. అనంతరం ప్రవచనకారులు అప్పలనాయుడు, అనంతరావు సత్సంగంతో కలిగే ఆధ్యాత్మిక లాభాలు, జీవనంలో ధర్మమార్గం అనుసరణపై ప్రసంగించారు. ఈ సత్సంగ సభకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా సంస్కారభారతి హైస్కూల్ వార్షికోత్సవం




**సోంపేట, జనవరి 4(వార్త):** సోంపేటలోని బీఎస్ కాలనీలో గల సంస్కారభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం కనులపండువగా జరిగింది. అతిథులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరైన వార్షికోత్సవ కార్యక్రమం ప్రిన్సిపాల్ శిలగాన భీమారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలలో భాగంగా విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో ఎంతగానో అలరించారు. పలువురు విద్యార్థులు సాంస్కృతిక గీతాలకు అందమైన స్టెప్పులతో అలరించారు. చిన్నారుల కార్యక్రమాలు ప్రేక్షకులను కట్టి పడేశాయి. అంతకుముందు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ నిమ్మన దాసు, చైర్మన్ వై.దేవరాజు, డైరెక్టర్ నిమ్మన లీలారాణి తదితరులు మాట్లాడుతూ పేద మధ్య తరగతి వర్గాల విద్యాభివృద్ధి లక్ష్యంగా రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించిన పాఠశాలను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.

విద్యార్థులలో క్రమశిక్షణ మంచి సంస్కారం పెంపొందించడమే లక్ష్యంగా వారి భవిష్యత్తులను ఉన్నతంగా తీర్చి దిద్దడమే ధ్యేయంగా సంస్కారభారతి హైస్కూల్ నిర్వహిస్తున్నట్టు తెలి పారు. కార్యక్రమంలో ఏవో పాపారావు, కళాశాలల ప్రిన్సిపాల్ శ్రీరామ్ కవిబాబు, శ్రీనుబాబు, సింహాచలం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.




## అలుదు జడ్పీ పాఠశాలలో వ్యాసరచన పోటీలు



**సారవకోట, జనవరి 4 (వార్త):** అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నియోజకవర్గ స్థాయి వ్యాస రచన పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని అలుదు యువత ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యాసరచనతో పాటు క్విజ్, టాలెంట్ టెస్ట్ వంటి పోటీలను నిర్వహించి విద్యార్థుల సృజనాత్మకత, విజ్ఞానాన్ని పరీక్షించారు. నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు స్వామి వివేకానందుడి ఆలోచనలు, జీవన విలువలను అవగాహన చేసుకోవడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరింతగా నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

## ప్రపంచ తెలుగు మహాసభల్లో నీలంకు సన్మానం



**పోలాకి, జనవరి 4(వార్త):** రాళ్లపాడు గ్రామానికి చెందిన ప్రముఖ తెలుగు కవి గేదెల నీలంకు ప్రపంచ తెలుగు మహాసభల్లో అరుదైన గౌరవం లభించింది. గుంటూరులో ఆదివారం ఘనంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై నీలం చేస్తున్న సాహిత్య సేవలకు గుర్తింపుగా నిర్వాహకులు ప్రతిభా పురస్కారంతో పాటు ప్రత్యేక సన్మానం నిర్వహించారు. తెలుగు భాష, సాహిత్య అభివృద్ధికి గేదెల నీలం అందిస్తున్న విశేష సేవలు ప్రశంసనీయమని సభలో పాల్గొన్న ప్రముఖ వక్తలు కొనియాడారు. గ్రామీణ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తూ సామాజిక అంశాలను స్పృశించే ఆయన రచనలు తెలుగు సాహిత్యానికి కొత్త దిశానిర్దేశం చేస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వక్తలు, రచయితలు మాట్లాడుతూ సమాజ మార్పునకు దోహదపడేలా సాహిత్యాన్ని సృష్టించాలని సూచించారు. భాషాభివృద్ధితో పాటు సమాజంలో చైతన్యం తీసుకురావడంలో రచయితల పాత్ర కీలకమన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో శ్రీకాకుళం కవికి లభించిన ఈ గౌరవం జిల్లావాసులకు గర్వకారణంగా నిలిచింది.

## మొక్కలు నాటిన డిగ్రీ విద్యార్థులు

**నరసన్నపేట, జనవరి 4(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రశంసనీయమైన కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం యాతపేట, గొట్టిపల్లి గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను గ్రామస్థులకు అప్పగించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. మొక్కలు పెరగడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి లభిస్తాయని విద్యార్థులు అవగాహన కల్పించారు. అనంతరం స్థానికులకు శక్తి యాప్ ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ఎస్ఓఎస్ ఫీచర్‌ను ఉపయోగించడం ద్వారా ఆపద సమయంలో తక్షణ సహాయం పొందవచ్చని వివరించారు. ఈ యాప్ మహిళల భద్రతకు ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ఢిల్లీశ్వరరావు, నాగరాజు పాల్గొని విద్యార్థులను అభినందించారు. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నేటి నుంచి శాఖాపరమైన పరీక్షలు


**శ్రీకాకుళం, జనవరి 4(వార్త):** జిల్లాలో సోమవారం నుంచి శనివారం వరకు ఏపీపీఎస్సీ శాఖాపరమైన (డిపార్ట్మెంటల్) పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి తెలిపారు. ఆదివారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో పరీక్షల ఏర్పాట్లకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమన్వయ కమిటీ నిర్వహించారు. చిలకపాలెంలోని శివాని ఇంజినీరింగ్ కళాశాల, ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ కేంద్రాలను పరీక్ష కేంద్రాలుగా కేటాయించామన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు గంటన్నర ముందే కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. సమయపాలన విషయంలో నిబంధనలు కఠినంగా ఉంటాయని, ఉదయం 9:30 గంటలు, మధ్యాహ్నం 2:30 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించబోమని ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ పి.వి. నవజ్యోతి స్పష్టం చేశారు. పరీక్ష హాల్లోకి సెల్ఫోన్లు, వాచీలు, క్యాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావడాన్ని పూర్తిగా నిషేధించారు. ఇన్విజిలేటర్లు సైతం ఫోన్లు వాడకూడదని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి ఎ. నాగలక్ష్మి, వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పైడపునాయుడు,పరీక్ష కేంద్రాల ప్రతినిధులు సమన్వయ అధికారులు, డిఎంహెచ్, ఏపీఈపీడీసీఎల్ తదితర శాఖల సిబ్బంది హాజరయ్యారు.

# భారీ యంత్రాలతో.. గిరిజనుల..
# రహదారులు ధ్వంసం



* పట్టించుకోని ఐటీడీప అధికారులు
* అభివృద్ధి పేరుతో విధ్వంసమంటూ గిరిజనుల ఆరోపణ
* వాహనాలను అడ్డుకున్న గిరిజన యువకులు
* పాలకులు, అధికారులు స్పందించాలని డిమాండ్

**మందస, జనవరి 4(వార్త):** గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి మాటేమో కానీ.. ఉన్న రహదారులు ధ్వంసమవుతున్నాయి.. గిరిజనులంటే చిన్నచూపుతోనే తమకు అన్యాయం జరుగుతోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీప అధికారులు పట్టించుకోకపోవడంతోనే నష్టానికి గురవుతున్నామని వాపోతున్నారు. ఇటీవల మందస మండలంలోని పలాస- మందస సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న సంఘటనలే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. మందస మండలానికి ఆనించి పలాస మండలం ఉంది. ఈ మండలంలోని రామకృష్ణాపురం సమీపంలో ఇండస్ట్రీయల్ పేరిట పనులు జరుగుతున్నాయి. పనుల్లో భారీ వాహనాలు, యంత్రాలను వినియోగిస్తున్నారు. వాహనాలు, భారీ యంత్రాలు మందస మండలంలోని గిరిజన గ్రామాలో నిర్మించిన తారురోడ్ల మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. గిరిజన గ్రామాల్లోని కొన్ని ప్రాంతాల్లో మట్టి తేలికగా, మరికొన్ని చోట్ల ఇసుకతో ఉంటుంది. ఈ ప్రాంతాల్లో వేసిన రోడ్డు కూడా కొంతకాలం క్రితం వేసినవే.. భారీ యంత్రాలు, వాహనాలు రాకపోకలతో రహదారులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కొన్ని రహదారులు పూర్తిగా పాడవుతున్నాయి. రూ.కోట్ల వ్యయంతో నిర్మించి, రహదారులను అభివృద్ధి పేరిట ధ్వంసం చేస్తున్నారని గిరిజనులు పోరాటం చేయడానికి సమాయత్తం అవుతున్నారు. దీనిలో భాగంగా ఆయా వాహనాలను నిలిపి, తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో తమ పనులు పూర్తి చేసుకోవడానికే అన్నట్టు నిర్వాహకులు మళ్లీ రహదారులను బాగు చేస్తామని గిరిజనులతో నమ్మబలికారు. రహదారులు బాగు చేయడం పక్కన పెడితే రోజులు, వారాల పాటు గోపిటూరు, కొయ్యడూరు, రామరాయి, గట్టూరు, పట్టులోగాం, చాపరాయికాలనీ తదితర ప్రాంతాల్లో విరామం లేకుండా పెద్ద పెద్ద శబ్దాలతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.. రహదారులను శిథిలావస్థకు చేర్చుతున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రహదారులు ధ్వంసం కావడంతో ఉన్న తమ ప్రాంతాల్లో రోడ్డును చూసి, గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీపతో పాటు స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ విధ్వంసంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న ఈ అభివృద్ధి తిరోగమన పనులపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి, గిరిజన ప్రాంతాల్లోని రహదారులకు నష్టం కలుగకుండా.. ప్రస్తుతం పాడైన రోడ్లను బాగు చేయించాలని వారు కోరుతున్నారు.









## నేడు ఎంఎల్ఏ శిరీషా మందసలో పర్యటన

**మందస, జనవరి 4(వార్త):** పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఈ నెల 5న మందస మండలంలో పర్యటించనున్నారు. సాయంత్రం 4గంటలకు మందస మండలంలోని దున్నువూరు గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సులో పాల్గొని కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తారు. అనంతరం 5గంటలకు హరిపురంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో జరిగే ఉపాధ్యాయుల సన్మానం కార్యక్రమంలో పాల్గొంటారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని.. టీడీపీ మందస మండల నాయకులు కోరారు.

## కవి 'మార్పు జగన్మోహనరావు'కు సన్మానం



**మందస, జనవరి 4(వార్త):** తెలుగు మహాసభల్లో కవి మార్పు జగన్మోహనరావుకు సన్మానం జరిగింది. 3వ ప్రపంచ తెలుగు మహాసభలు ఆంధ్రప్రదేశ్ సారథ్యంలో ఈనెల 5 వరకూ జరిగాయి. అమరావతి ఆంధ్ర సారస్వత పరిషత్ ఆంధ్రప్రదేశ్ సారథ్యంలో ఆదివారం శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరం, హైవే గుంటూరు వద్ద నిర్వహిస్తున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలు ఘనంగా కొనసాగాయి. ఈ మహాసభల్లో భాగంగా నిర్వహించిన శ్రీజాషువా, శ్రీకరుణ, శ్రీకవి సంమేళనాల వేదికపై శ్రీకాకుళం జిల్లా మందస మండలంలోని బిన్నలమదనాపురం గ్రామానికి చెందిన కవి మార్పు జగన్మోహనరావుకు ఘన సన్మానం జరిగింది. నిర్వాహకుల చేతుల మీద సర్టిఫికెట్ తో పాటు మెడల్ బహుకరించారు. అనంతరం దుశ్శాలువతో సత్కరించారు. అంతర్జాతీయ వేదికపై కవి మార్పు జగన్మోహనరావుకు సన్మానం జరగడంతో ఆయన అభిమానులు, గ్రామస్తులు, స్తానికులు అభినందనలు తెలిపారు.

## పలు కుటుంబాలకు వైసీపీ నేతల పరామర్శ



**సోంపేట జనవరి 4 (వార్త):** కంచిలి మండలంలో ఇటీవల మృతి చెందిన వైసీపీ సానుభూతిపరుల కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి తో పాటు పలువురు వైసీపీ నేతలు కలిసి ఆదివారం పరామర్శించారు. కత్తి వరం, సోంపేట మండలం జింకుభద్ర తదితర గ్రామాల్లో పర్యటించి బాధితులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వజ్జ మృత్యుంజయం, దుర్గాసి ధర్మారావు, తలగాన తిరుపతి, కొనపల సురేష్, లడ్డు కేశవ పాత్ర, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు




**శ్రీకాకుళం, జనవరి 4(వార్త):** అంధులు, పాక్షిక దృష్టి లోపం ఉన్నవారి జీవితాల్లో బ్రెయిలీ లిపి సరికొత్త వెలుగులు నింపిందని, ఈ గొప్ప ఆవిష్కరణ ద్వారా వారు విద్యావంతులుగా మారి సమాజంలో సగౌరవంగా జీవించగలుగుతున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో ఆదివారం కలెక్టరేట్ ఆవరణలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షమ శాఖ కార్యాలయంలో ః ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంః ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. దృష్టి లోపం ఉన్నవారు ఆత్మన్యూనతా భావాన్ని వీడి లూయిస్ బ్రెయిలీని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. దృష్టి లోపం ఉన్నవారికి న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి చట్టపరంగా లభించే హక్కులను హరిబాబు వివరించారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా తక్షణమే న్యాయ సేవా సంస్థను ఆశ్రయించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో కల్పిస్తున్న రిజర్వేషన్లు, ఇతర రాయితీలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. విభిన్న ప్రతిభావంతులు తమ ప్రతిభతో సమాజానికి సేవలు అందించి తగిన ప్రతిఫలం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షమ శాఖ సహాయ సంచాలకులు శైలజ, వివిధ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైలెక్కి.. హల్‌చల్

**సోంపేట, జనవరి 4 (వార్త):** కంచిలి రైల్వే స్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం 3:30 గంటలకు భువనేశ్వర్ బి తిరుపతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఆగి ఉన్న సమయంలో రైలు భోగి పైకి ఒడిసాకు చెందిన వ్యక్తి ఎక్కేశాడు. దీంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనేశ్వర్ తిరుపతి సూపర్ఫాస్ట్ ఎక్స్ప్రెస్ రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న సమయంలో ఒడిసాకి చెందిన విజయ్ సర్కార్ అనే వ్యక్తి రైలు భోగి పైకి ఎక్కడంతో ప్రయాణికులంతా ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. అది గమనించిన స్థానిక రైల్వే అధికారులు ముందస్తు జాగ్రత్తగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి, పోలీసులు సహాయంతో వ్యక్తిని కిందకు దించారు. అతడిని పరిశీలించగా నాల్గవ తేదీ కలిగిన విశాఖపట్నం నుంచి హౌరా మెయిల్ టికెట్ లభించిందని, అతడు కొంత మతిస్థిమితం లేనివిధంగా ప్రవర్తిస్తుండటంతో స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించారు. స్టేషన్ మాస్టర్ బలరాం బెహరా ఇచ్చిన సమాచారంతో కంచిలి ఎస్సై పారినాయుడు, ఆర్పిఎఫ్ ఏఎస్ఐ పాణిగ్రాహీలు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సంఘటన కారణంగా సుమారు 20 నిమిషాల పాటు రైలు కంచిలి రైల్వే స్టేషన్లో నిలిచిపోయింది.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546